సాక్షి
మహబూబ్‌నగర్
సోమవారం। 8। మే। 2023



పసిప్రాణాలతో చెలగాటం
తలసేమియా అభం శుభం తెలియని పసివారి ప్రాణాలతో చెలగాటమాడుతోంది.
వివరాలు 8లో ▸



రైతు బే(బ)జార్
జడ్చర్లలో రూ.3.75 కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన రైతుబజార్ మూతపడింది.
వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
33.1 /24.7
వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది. తేమ ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మెగా శాకాహార ర్యాలీ



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో స్పిరిచ్యువల్ సొసైటీస్ ఆధ్వర్యంలో మెగా శాకాహార ర్యాలీ నిర్వహించారు. శ్రీకృష్ణ దేవాలయం కమాన్ నుంచి శాకాహార ర్యాలీ ప్రారంభంకాగా న్యూటౌన్, బస్టాండ్, తెలంగాణ చౌరస్తా, రైల్వే స్టేషన్ మీదుగా కొనసాగింది. శాకాహారం తీసుకోవడం వల్లే కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ, కరపత్రాలు పంచుతూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ జనరల్ సెక్రటరీ మారం శివప్రసాద్ మాట్లాడుతూ ధ్యాన గురువు పత్రీజీ ఆశయాలను సాధిద్దామని పిలుపునిచ్చారు. ధ్యాన శాకాహారం, పిరమిడ్ జగత్ పత్రీజీ లక్ష్యమని, దీని కోసం పిరమిడ్ మాస్టర్లు కృషి చేయాలని కోరారు. జిల్లా కేంద్రంలో పిరమిడ్ నిర్మాణానికి అందరూ సహాయ, సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో పీఎస్ఎస్ఎం వివిధ జిల్లా అధ్యక్షులు చెన్న కేశవులు, రామకృష్ణ, సాయిబాబా, ప్యాట్రన్ వైడి గుప్త, శివప్రసాద్, సత్యనారాయణరాజు, సూర్యప్రకాశ్, ప్రవీణ్, విజయ్‌భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

10న రౌండ్‌టేబుల్ సమావేశం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రం న్యూటౌన్‌లోని ఆల్‌మేవా భవనంలో ఈనెల 10వ తేదీన ఉదయం 10 గంటలకు 'ముస్లింల షెూష-ధూమ్‌ధామ్ ముచ్చట' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఆల్‌మైనార్టీ ఎంప్లాయిస్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు ఎండీ ఇష్రత్‌అలీ తెలిపారు. జిల్లాకేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వెనుకబడిన ముస్లింల రిజర్వేషన్లను రద్దు చేస్తామంటూ, ఇతర వర్గాలలో ముస్లింలపై ద్వేషం పెరిగేటట్లు జరుగుతున్న పరిణామాలు మిగతా అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి వివిధ రాజకీయ నాయకులు, ప్రజాస్వామికవాదులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సయ్యద్ ఖాజాజైనుల్లాఅబెదిన్, సిరాజ్‌ఖాన్ పాల్గొన్నారు.

నేడు జిల్లాకేంద్రంలో విద్యుత్ కోత

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రైల్వేస్టేషన్ 11 కేవీ లైన్ మరమ్మతు కారణంగా సోమవారం జిల్లాకేంద్రంలో విద్యుత్ కోత ఉండనున్నట్లు టౌన్-2 ఏఈ భగవంతయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సుభాష్‌నగర్, పాల్‌సాబ్‌గుట్ట, రైల్వేస్టేషన్ ప్రాంతం, శెట్టి కాంప్లెక్స్, రాజేంద్రనగర్, టీవీ టవర్, సద్దులగుండు, 40 ఇళ్ల ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.

12 నుంచి 'ఓపెన్' వాల్యుయేషన్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇటీవలి ఓపెన్ స్కూల్ ఇంటర్, టెన్త్ పరీక్షలు పూర్తి అయిన నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ అధికారులు జవాబుపత్రాలను దిద్దే ప్రక్రియను ప్రారంభించారు. ఈ మేరకు జిల్లాకేంద్రంలోని మోడల్ బేసిక్ స్కూల్ క్యాంప్‌లో ఏర్పాటు చేయనున్నారు. ఈ నెల 12 నుంచి 14 వరకు ఓపెన్ ఇంటర్, 15 నుంచి 17 వరకు ఓపెన్ టెన్త్ జవాబు పత్రాలు దిద్దనున్నారు.

హజ్‌యాత్రపై సంపూర్ణ అవగాహన ఉండాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: హజ్‌యాత్రపై యాత్రికులకు సంపూర్ణ అవగాహన ఉండాలని మతపెద్ద మౌలానా సయ్యద్ రవూఫ్‌అలీ అన్నారు. జిల్లా హజ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో రెండో విడత శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ శిబిరాలను హజ్‌యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హజ్ యాత్ర నియమ, నిబంధనలు, యాత్ర చేసే పద్ధతుల గురించి తెలుసుకోవాలన్నారు. అనంతరం జిల్లా హజ్‌సొసైటీ ప్రతినిధులు ఎహ్రాం ధరించే విధానాన్ని ప్రాక్టికల్‌గా యాత్రికులకు అవగాహన కల్పించి, హజ్ గైడ్‌లను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా హజ్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్ మహమూద్‌అలీ, మహ్మద్ మేరాజుద్దీన్, రవూఫ్, ఎం.ఎ.సత్తార్, రజాక్, ఖాజా నిజాముద్దీన్, మహ్మద్ రఫీక్, అహ్మద్ పటేల్ పాల్గొన్నారు.



తొలగని నీలినీడలు

జనవరిలో ప్రక్రియ ప్రారంభించినా.. కోర్టు కేసులతో నిలిచిన వైనం

- ఉమ్మడి జిల్లాలో రెండు వేలకుపైగా పోస్టులు ఖాళీ
- జీహెచ్‌ఎం, ఎంఈఓ, ఎస్‌ఏలుగా పదోన్నతులు వస్తాయని ఆశలు
- వేసవిసెలవుల్లో పూర్తి చేయాలని డిమాండ్
- అక్రమ బదిలీలతో అర్హులకు అన్యాయం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళన నెలకొంది. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం జనవరి ప్రారంభంలో బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించి దరఖాస్తులు సైతం స్వీకరించింది. బదిలీల్లో స్పౌజ్ కేసులు ఉన్న వారికి పాయింట్లు ఎక్కువ ఇవ్వడంతో నాన్ స్పౌజ్ వారు అన్యాయం జరుగుతోందని కోర్టును ఆశ్రయించడంతో ప్రక్రియ నిలిచిపోయింది. వేసవి సెలవుల్లో ప్రక్రియ పూర్తి చేయాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. ప్రధానంగా ఈ ఏడాది చివర్లో ఎన్నికలు ఉన్నందున ఇప్పుడు చేపట్టకపోతే మరో ఏడాది పాటు వేచి ఉండాల్సి వస్తోందన్న వాదన లున్నాయి. అయిదేళ్ల కిందట ప్రభుత్వం ఉమ్మడి జిల్లా ప్రతిపాదికన బదిలీలు చేపట్టింది. గతేడాది జిల్లాల వారీగా కేడర్ విభజన చేశారు. వీటితో పాటు పండిట్, పీఈటీల సమస్యలు, 317 అన్యాయం జరిగిన వారు, స్పౌజ్ కేసుల సమస్యలు కూడా అలాగే ఉన్నాయి.



అక్రమ బదిలీలు..

ఈ ఏడాది జనవరిలో బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని నిర్ణయించిన ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసిన వెంటనే కొందరు ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయిలో పైరవీలు చేసి నేరుగా సచివాలయం నుంచి బదిలీ ఆర్డర్లు తీసుకొచ్చి జిల్లాలోని మంచి స్థానాలను ఎంచుకున్నారు. ఇలాంటి పైరవీలు ఎక్కువగా నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో జరిగాయి. ఉమ్మడి జిల్లాలో 60కి పైగా అక్రమ బదిలీలు జరిగినట్లు తెలుస్తోంది. దీంతో ఎక్కువ సర్వీస్, ఆరోగ్య సమస్యలు, దివ్యాంగులకు అన్యాయం జరిగే అవకాశాలు ఉన్నాయి. వీటిని రద్దు చేయాలన్న వాదలు వినిపిస్తున్నాయి.

ఖాళీలతో సమస్యలు..

ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత 2015లో ఒకసారి పదోన్నతులు చేపట్టారు. పదోన్నతులు చేపట్టి చాలాకాలం కావడంతో వివిధ స్థాయిల్లో పోస్టులు చాలా వరకు ఖాళీగా ఉన్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 13 వేల మంది ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తుండగా.. 2,032 ఎస్జీటీ, ఎస్‌ఏ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 630 ఎస్‌ఏ పోస్టుల్లో 350 పదోన్నతుల ద్వారా భర్తీ చేసి మిగతావి డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని విద్యాశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక 68 మండలాలకు ఎంఈఓలను సీనియర్ జీహెచ్‌ఎంల ద్వారా భర్తీ చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఏడుగురు ఎంఈఓలు విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే డైట్, బీఈడీ కళాశాలల్లో కూడా సీనియర్ స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు ఇవ్వాల్సి ఉంది. కానీ వాటిని కూడా భర్తీ చేయడం లేదని తెలుస్తోంది.

జిల్లాల వారీగా వివరాలు

జిల్లా	పాఠశాలలు	ఉపాధ్యాయులు	ఖాళీలు	బ.ద.చే.వా
మహబూబ్‌నగర్	876	3,482	479	1,751
నాగర్‌కర్నూల్	845	3,390	450	1,785
వనపర్తి	535	2,023	316	1,212
నారాయణపేట	510	2020	470	1060
జోగులాంబ గద్వాల	475	1,971	317	1,285

బ.ద.చే.వా : బదిలీలకు దరఖాస్తు చేసుకున్న వారు

విద్యావ్యవస్థపై ప్రతికూల ప్రభావం..



ప్రభుత్వం వెంటనే బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలి. కొంతకాలంగా ఈ ప్రక్రియ చేపట్టకపోవడంతో విద్యావ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. కోర్టు కేసులు ఉన్నందున ప్రమోషన్లు అడహక్ పద్ధతిలో ఇవ్వాలి. కోర్టుకేసుల తర్వాత సీనియర్‌లకు న్యాయం జరుగుతుంది.

– సునీల్, జిల్లా అధ్యక్షుడు, తపస్

వేసవిలోగా చేపట్టాలి..



8 ఏళ్లుగా పదోన్నతులు.. అయిదేళ్లుగా బదిలీలు లేవు. ప్రమోషన్లు లేకపోవడంతో ఏ క్యాడర్ వారు ఆ క్యాడర్‌లోనే ఉద్యోగ విరమణ పొందే అవకాశం ఉంది. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ మధ్యలో నిలిచిపోవడంతో ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారు. సంవత్సరం చివర్లో ఎన్నికలు వచ్చే అవకాశం ఉన్నందున వెంటనే షెడ్యూల్ ఇవ్వాలి.

– కృష్ణుడు, రాష్ట్ర అధ్యక్షుడు, టీసీ ఉపాధ్యాయ సంఘం

దశాబ్దాల కల.. నెరవేరనున్న వేళ



దేవరకద్రలో నిర్మాణం పూర్తి చేసుకున్న ఆర్వోబీ

- ఎట్టకేలకు దేవరకద్ర ఆర్వోబీ పనులు పూర్తి
- నేడు ప్రారంభించనున్న ముగ్గురు మంత్రులు
- తీరనున్న ట్రాఫిక్ కష్టాలు

దేవరకద్ర: పదేళ్లుగా ట్రాఫిక్‌తో సతమతం అవుతున్న వాహనదారుల ఇబ్బందులు సోమవారం నుంచి తీరబోతున్నాయి. 167వ నంబర్ జాతీయ రహదారిగా మారిన తరువాత దేవరకద్ర మీదుగా కర్ణాటక, హైదరాబాద్ ప్రాంతాలకు రాకపోకలు పెరిగాయి. ఇదే సమయంలో దేవరకద్ర మీదుగా నిత్యం 50 వరకు రైళ్లు ప్రయాణిస్తుంటాయి. వీటికి తోడు ప్రత్యేక రైళ్లు, గూడ్సు రైళ్లతో సంఖ్య ఒక్కోసారి పెరుగుతుంది. రైళ్ల రాకపోకల సమయంలో దేవరకద్ర కొత్త బస్టాండ్ వద్ద ప్రధాన రహదారిపై ఉన్న గేటును వేయాల్సి ఉంటుంది. నిత్యం రైల్వే గేటు పడుతుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు గంటల తరబడి గేటు వద్ద వేచి ఉండడంతో పాటు ట్రాఫిక్‌లో ఇరుక్కొని నానా ఇబ్బందులు ఎదుర్కొనేవారు. సోమవారం ఆర్వోబీ ప్రారంభంతో ట్రాఫిక్ సమస్యలన్నీ తీరనున్నాయి. ఆర్వోబీని ప్రారంభించడానికి రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి హాజరు కానున్నారు.

■ దేవరకద్ర మీదుగా రాకపోకల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆర్వోబీ నిర్మాణానికి ప్రతిపాదనలు రాగా.. 2014లో ఎన్నికల ముందు అప్పటి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రైల్వేగేట్ దగ్గర రైల్వే డిపార్ట్‌మెంట్ ముందుగా పనులు ప్రారంభించి.. 2015లో గేటు ట్రాక్ పరిధిలో పనులు పూర్తి చేశారు. ఆర్‌అండ్‌బీ పరిధిలోని కిలోమీటర్ ఆర్వోబీ పనులకు ఓ కాంట్రాక్టర్ టెండర్ తీసుకొని.. పిల్లర్ల కోసం పెద్ద గోతులు తీసి, సాయిల్ టెస్ట్‌కు మట్టి నమూనాలను పంపించారు. అయితే ఆ తర్వాత పనులు ప్రారంభం కాకపోవడంతో వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రమాదభరితంగా మారిన గుంతలను గ్రామపంచాయతీ సిబ్బంది పూడ్చివేశారు. ఈ తర్వాత కాంట్రాక్ట్ అగ్రిమెంట్ రద్దు చేసి.. రాష్ట్ర ప్రభుత్వం రూ.24.65కోట్లతో మళ్లీ అంచనా వేయించి.. కొత్త టెండర్లను పిలిచి, 2019లోగా పనులు పూర్తి చేయాలని మరో కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఆ తర్వాత 2021 చివరి వరకు రెండేళ్లలో ఆర్వోబీ పనులు పూర్తి చేయాలని అగ్రిమెంట్ చేశారు. కోవిడ్ వ్యాప్తితో లాక్‌డౌన్, చేసిన పనులకు బిల్లుల చెల్లింపు ఆలస్యం కావడంతో ఏడాది గడువు పెంచుతూ 2022 డిసెంబర్ వరకు పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చారు. నిర్ణీత సమయంలోగా పనులు పూర్తి కాకపోవడంతో మళ్లీ ఈ ఏడాది ఏప్రిల్ వరకు గడువు పొడిగించారు. ఎట్టకేలకు ప్రస్తుతం పనులు పూర్తి కావడంతో ప్రారంభోత్సవానికి ముస్తాబైంది.

రాష్ట్ర ప్రభుత్వం నిధులతో..



దశాబ్దాల కల నెరవేరబోతుంది. నిత్యం దేవరకద్ర రైల్వేగేటు వద్ద ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం కాబోతుంది. కేంద్ర ప్రభుత్వం ఆర్వోబీకి నిధులు ఇవ్వాలి కానీ.. ఎన్నిసార్లు ప్రతిపాదనలు చేసినా స్పందించలేదు. దీంతో ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ.24.65 కోట్లను మంజూరు చేయించాం. ఆర్‌అండ్‌బీ ద్వారా పనులు పూర్తి చేయించి ప్రారంభిస్తున్నాం.

– దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

ఇబ్బందులు దూరం..



ఇంతకాలం దేవరకద్ర రైల్వే గేటు వల్ల వాహనదారులు పడ్డ ఇబ్బందులు తొలగిపోనున్నాయి. గేటు వేసినప్పుడల్లా గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించి.. ప్రజలు అవస్థలు పడ్డారు. ఆర్వోబీ ప్రారంభంతో ఇక ఎలాంటి సమస్య లేకుండా నేరుగా ప్రయాణించడానికి అవకాశం ఉంటుంది. ప్రజల దశాబ్దం కల నేడు నెరవేరబోతోంది. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో ఆర్వోబీని పూర్తి చేయించారు.

–రమాదేవి, ఎంపీపీ, దేవరకద్ర

ప్రశాంతంగా 'నీట్'



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్/జడ్చర్లటౌన్: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆదివారం జరిగిన నీట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ మేరకు 13 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో మొత్తం 5,036 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా.. 4,906 మంది హాజరయ్యారు. ఈ మేరకు పలువురు అధికారులు కేంద్రాలను పరిశీలించారు. జడ్చర్ల పట్టణంలోని గీతాశ్రీ పాఠశాలలో 236 మంది, శ్లోకలో 262 మంది, స్వామినారాయణ గురుకులంలో 165 మంది నీట్ పరీక్ష రాశారు.



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

శ్రీరస్తు.. శుభమస్తు..

8లో

- వైభవంగా సామూహిక వివాహాలు
- అలివేలుమంగమ్మ సన్నిధిలో ఒక్కటైన 21 జంటలు
- నూతన జంటలకు అండగా ఉంటా: మంత్రి శ్రీనివాస్‌గౌడ్

- మహబూబ్‌నగర్ రూరల్

ట్రేడ్ లైసెన్స్‌పై దృష్టి ఏదీ..?

- 2022-23కు గాను 30.68 శాతమే వసూలు
- 2021-22 ఆర్థిక సంవత్సరంలో 14.14 శాతమే
- మహబూబ్‌నగర్‌లో గుర్తించిన దుకాణాలు 3,600
- కరోనా కారణంగా మూతబడినవి సుమారు 400



తెలంగాణ చౌరస్తాలోని ఓ వస్త్ర దుకాణంలో ట్రేడ్ లైసెన్సును పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పురపాలక సంఘాలకు వచ్చే ఆదాయ వనరుల్లో ఆస్తి పన్ను సింహభాగమైతే.. ఆ తర్వాత ట్రేడ్ లైసెన్స్‌ల నుంచి రాబడి ఎక్కువ వస్తుంది. అయితే మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అనుకున్న లక్ష్యం చేరుకోవడం లేదు. వాస్తవానికి వేలల్లో దుకాణాలు ఉంటే.. వందల షాపుల నుంచే రాబట్టడం గమనార్హం. ప్రతి పట్టణంలో ఏ వ్యాపారం నిర్వహించాలన్నా ముందుగా మున్సిపాలిటీ నుంచి ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాల్సిందే. అనంతరం ఏటా రెన్యూవల్ చేసుకోవాలి. వీటిపై పర్యవేక్షించే అధికారం మున్సిపాలిటీదే అయినా ఏ మాత్రం శ్రద్ధ చూపించడం లేదు. జిల్లాకేంద్రంలో వేలాది సంఖ్యలో వివిధ వ్యాపార దుకాణాలు, ఫ్యాక్టరీలు ఉన్నాయి. అయినా ట్రేడ్ లైసెన్స్ ఫీజు వసూళ్లపై అధికారులు దృష్టి పెట్టలేకపోయారు.

■ మహబూబ్‌నగర్‌లో హైదరాబాద్-రాయచూర్ ప్రధాన రోడ్డుకు ఇరువైపులా 3కి.మీ.పరిధిలో సుమారు ఐదు వేల షాపులు ఉంటాయి. ఇతర ప్రాంతాల్లో మరో వేయి దుకాణాలు ఉంటాయి. ఇక మున్సిపల్ కాంప్లెక్స్‌ల పరిధిలో సుమారు 350 దుకాణాలు ఉన్నాయి. అయితే మున్సిపల్ అధికారులు మాత్రం పట్టణంలో అన్నీ కలిపి సుమారు 3,600 ఉన్నట్లు గుర్తించారు. ఇక 2020లో వచ్చిన కరోనాతో ఇప్పటి వరకు సుమారు 400 దుకాణాలు మూతపడ్డాయని చెబుతున్నారు. ఆయా షాపుల నుంచి ట్రేడ్ లైసెన్సు ఫీజు వసూళ్లలో బాగా వెనుకబడిపోయారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.84, 65,715 వస్తుందని అంచనా వేశారు. అలాగే పాత బకాయిలు రూ.48,96,028, జరిమానా కింద రూ.38,34,844 ఇలా మొత్తం రూ.1,71,96,587 రావాల్సి ఉంది. ఇప్పటివరకు 681 దుకాణాల నుంచి రూ.47,10,712, బకాయిల కింద రూ.2,82,419, జరిమానా రూ.2,82,365 ఇలా మొత్తం రూ.52,75,496 (30.68 శాతం)మాత్రమే వసూలు చేశారు. ఇంకా అసలు రూ.37,55,003తో పాటు పాత బకాయిలు రూ.46,13,609, జరిమానా కింద రూ.35,52,479 కలిపి మొత్తం రూ.1,19,21,091 రావాల్సి ఉంది.

■ 2021-22లో రూ.22,98,715 వస్తుందని అంచనా వేశారు. పాత బకాయిలు రూ.17,10,800, జరిమానా కింద రూ.69,387 ఇలా మొత్తం 40,78,902 వస్తుందని భావించారు. అయితే 572 దుకాణాల నుంచి రూ.4,83,471, బకాయిలు రూ.66,600, జరిమానా కింద రూ.26,783 ఇలా మొత్తం రూ.5,76,854 (14.14 శాతం) మాత్రమే వసూలైంది. ఇంకా అసలు రూ.18,15,244 తో పాటు పాత బకాయిలు రూ.16,44,200, జరిమానా కింద రూ.42,604 కలిపి మొత్తం రూ.35,02,048 రాలేదు.

లక్ష్యం చేరుకోవడానికి యత్నిస్తాం



ట్రేడ్ లైసెన్సు ఫీజులకు సంబంధించి 2021-22 నుంచి కొత్త రేట్లు అమలులోకి వచ్చాయి. దీంతో ఆ ఏడాది ఎక్కువగా వసూలు కాలేదు. ఇక 2022-23కు గాను ఈ నెలాఖరులోగా లక్ష్యం చేరుకోవడానికి యత్నిస్తాం. ప్రస్తుతం స్పెషల్ డ్రైవ్ కొనసాగుతోంది. ప్రతి షాపును తనిఖీ చేసి గడువులోగా ఎవరైనా చెల్లించకపోతే 50 శాతం జరిమానా విధిస్తాం.

– డి.ప్రదీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, మహబూబ్‌నగర్

ప్రజల ముందుకు మంత్రులు, ఎమ్మెల్యేల అక్రమాలు



మాట్లాడుతున్న జి.మధుసూదన్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేల అవినీతి, అక్రమాల చిట్టాను సమయం వచ్చినప్పుడు ప్రజల ముందు ఉంచుతామని డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పట్ల మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. రేవంత్‌రెడ్డి కాలిగోటిని కూడా తాకలేరని విమర్శించారు. మంత్రి, అతని తమ్ముడు అధికారాన్ని అడ్డుపెట్టుకొని అభివృద్ధి ముసుగులో ఏ విధమైన అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారో మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని ప్రతి ఒక్క ఓటరుకు తెలుసునని అన్నారు. అబద్ధాలు మాట్లాడడంలో మంత్రి కేటీఆర్ తండ్రిని మించిన తనయుడిగా పేరు సంపాదించుకున్నారని ఎద్దేవా చేశారు.మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డిపై మంత్రి వ్యాఖ్యలు సరికాదన్నారు. మరో నాలుగు నెలల్లో ప్రజలే నిర్ణయిస్తారని అన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్, నాయకులు వసంత, జహీర్, అక్తర్, సాయిబాబా, లక్ష్మణ్ యాదవ్, చంద్రశేఖర్, రాములు యాదవ్ పాల్గొన్నారు.

కిక్‌బాక్సింగ్ పోటీల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

మహబూబ్‌నగర్ క్రీడలు: మంచిర్యాలలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి కిక్‌బాక్సింగ్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చాటి పతకాలు సాధించినట్లు మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.రవికుమార్ తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను ఆదివారం మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్ ఆవరణలో కౌన్సిలర్ రష్మితా ప్రశాంత్ పతకాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి కిక్‌బాక్సింగ్ పోటీల్లో 24 మంది విద్యార్థులు పాల్గొనగా 23 మంది పతకాలు సాధించినట్లు తెలిపారు. పాయింట్ ఫైట్‌లో రెండు బంగారు, మూడు కాంస్యం, మ్యూజికల్ ఫాంలో 9 బంగారు పతకాలు, మూడు కాంస్యం, టీం కటాలో ఆరు బంగారు పతకాలు, సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను జిల్లా స్పోర్ట్స్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు జి.కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి రవినాయక్ అభినందించారు. కార్యక్రమంలో సంస్థ సలహాదారు ఎంఎస్.విజయ్‌కుమార్, వాగ్దేవి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం

- మృతుల్లో తండ్రి, మూడేళ్ల కుమార్తె
- తల్లి పరిస్థితి విషమం, స్వల్పగాయాలతో బయటపడిన బాలుడు
- భూత్పూర్ మండలం పెద్ద మొల్గర సమీపంలో ప్రమాదం

- భూత్పూర్



వివరాలు 8లో ▶

క్లుప్తంగా

చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఊట్కూర్: మండల కేంద్రంలోని పెద్దచెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని ఎస్‌ఐ రమేశ్ ఆదివారం తెలిపారు. మృతుని షర్టుకు బాంబే టైలర్ గుర్తు ఉందని, మెడకు ఎర్రని దారం, సుమారు 40 ఏళ్ల వయస్సు ఉంటుందన్నారు. చెరువు గట్టుకు బహిర్భూమికి వెళ్లినవారు మృతదేహాన్ని చూసి సమాచారం అందించారు. దీంతో మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం నారాయణపేట జిల్లా ఆస్పత్రికి తరలించామని చెప్పారు.

పిడుగుపడి ఎద్దు మృతి



తెలకపల్లి: పిడుగుపడి ఓ ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని గౌరారంలో చోటుచేసుకుంది. వివరాలిలా.. గ్రామానికి చెందిన సున్నం అగ్గిరాములు తన రెండు కాడెద్దులను పొలంలో కట్టేసి ఉంచాడు. శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. రాత్రి 7 గంటల సమయంలో పిడుగు పడడంతో ఎద్దు మృతిచెందింది. రైతు ఆదివారం ఉదయం పొలం దగ్గరకు వెళ్లగా పిడుగు పాటుతో మృతిచెందిన విషయం గుర్తించాడు. కాడెద్దు మృతిచెందడంతో రైతు కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతి చెందిన ఎద్దు విలువ రూ.80 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

పచ్చని పల్లెల్లో ప్రమాదకర ఫార్మా కంపెనీనా?



మహమ్మదాబాద్: పచ్చని పల్లెల్లో ప్రమాదకర ఫార్మా కంపెనీ పెట్టి రైతులను, పశువులను బలి తీసుకునేందుకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వడం ఏమిటని డీసీసీబీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి అన్నారు. వారం రోజులుగా నంచర్ల గేట్ దేశాయిపల్లి దగ్గర ఫార్మా కంపెనీకి వ్యతిరేకంగా కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షకు ఆదివారం ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. మినీ ఇండస్ట్రీ ప్రాంతంలో గ్రీన్ జోన్‌కు అనుమతులు ఉన్నాయని, అలాంటి సమయంలో రెడ్‌జోన్ మాదిరిగా ప్రమాదకర వ్యర్థాలు బయటికి వచ్చే ఫార్మాకు అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఈ ప్రాంతంలో రైతులు వ్యవసాయం, పశుపోషణపై ఆధారపడ్డారని, అలాంటప్పుడు వ్యవసాయ పొలాలు, రైతులు, పశువులు జీవించడానికి ఎంతో ఇబ్బంది కలుగుతుందని చెప్పారు. ప్రజలకు, రైతులకు ఇబ్బందులు కలిగించే ఏ పని చేసినా ఊరుకునేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు, రైతులకు అండగా ఉంటుందన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు నారాయణ, నాయకులు భీంరెడ్డి, నర్సింహులు, పాషా, నరేష్, అనంతయ్య, కృష్ణయ్య, లాలయ్య, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఆటో, బైక్ ఢీ: ముగ్గురికి గాయాలు



బిజినేపల్లి: మండలంలోని వెంకటాపూర్ గ్రామ సమీపంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న నలుగురు ఎదురుగా వస్తున్న ట్రాలీ ఆటోను ప్రమాదశావత్తు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. వట్టెంలో బొడ్రాయి ఉత్సవాల్లో పాల్గొని బైక్‌పై తిరుగు ప్రయాణమైన రాములు, తిరుపతయ్య, గోపాలకృష్ణ, మరో పాప వెంకటాపూర్ గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాలీ ఆటోను ప్రమాదశావత్తు ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో రాములుకు తీవ్రగాయాలు కాగా.. తిరుపతయ్య, గోపాలకృష్ణకు స్వల్ప గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాము వెంటనే 108 వాహనంలో వారిని నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

అదుపుతప్పి మూడు కార్లు..

బాలానగర్: అదుపు తప్పి మూడు కార్లు ఒకదానికి ఒకటి ఢీకొన్నాయి. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. బాలానగర్‌లోని జాతీయ రహదారిపై వాహనాల వేగాన్ని అదుపు చేసేందుకు ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లను గుర్తించని ఓ కారు సడెన్ బ్రేకు వేయడంతో ముందు కారు వేగాన్ని గుర్తించని వెనకాల కారు ముందు కారును, దానిని మరో కారు వెనకెనకే ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాకపోయినప్పటికీ వాహనాలు కొద్దిమేర దెబ్బతిన్నాయి. ప్రమాదానికి అకాల వర్షం పడటం కూడా ఒక కారణమని స్థానికులు తెలిపారు.



పసిప్రాణాలతో చెలగాటం

రక్త పిపాసి.. తలసేమియా



- ఖరీదైన వైద్యం చేయించుకోలేక అవస్థలు పడుతున్న నిరుపేదలు
- ఉమ్మడి జిల్లాలో 172 మంది తలసేమియా బాధితులు
- భరోసా కల్పిస్తున్న జనరల్ ఆస్పత్రి డేకేర్ సెంటర్

నేడు ప్రపంచ తలసేమియా, రెడ్‌క్రాస్ దినోత్సవం

పాలమూరు: తల్లిపాలు తాగే వయస్సులో రక్తాన్ని ఎక్కించుకుంటూ తల్లడిల్లుతున్నారు. బడికి వెళ్లాల్సిన సమయంలో రక్తనిధి కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. చాక్లెట్లు చప్పరించాల్సిన నోటితో చేదు బిల్లలు మింగుతున్నారు. తోటివారు ఆనందంగా ఆడుకుంటుంటే చూస్తూ ఉండటం తప్ప ఏమీ చేయలేని నిస్సహాయస్థితి వారిది. అలసట, ఆయాసాల మధ్య ప్రాణాంతక వ్యాధి తలసేమియా.. బాధితుల జీవితాలతో చెలగాటం ఆడుతోంది. ఉమ్మడి జిల్లాలో 172 మంది చిన్నారుల ఆనందాన్ని ఇది దూరం చేస్తోంది. అయితే వారి ఆయుష్షు పెంచే బాధ్యతను జిల్లా జనరల్ ఆస్పత్రి, రెడ్‌క్రాస్ తీసుకుంది.

వారికి ప్రాణాంతకమే..

తలసేమియా జన్యు సంబంధిత వ్యాధి. పసిపిల్లల ప్రాణాలతో చెలగాటమాడే రక్తపిశాచి. వారం, పదిహేను రోజులకు ఒకసారి రక్తాన్ని అందించాల్సిందే. లేకపోతే వారి ప్రాణాలకు ముప్పు వాటిల్లే పరిస్థితి. ఈ వ్యాధిగ్రస్తుల్లో హిమోగ్లోబిన్ ఉత్పత్తి శరీరానికి అవసరమైనంత ఉండదు. ఒకవేళ ఉత్పత్తి అయినా ఎక్కువ కాలం నిలవదు. దీంతో నిల్వలు పడిపోతుంటాయి. ఇలా పడిపోయిన ప్రతిసారీ సంబంధిత గ్రూపు రక్తాన్ని వెంటనే అందించాలి. అలా అందించలేని పరిస్థితి ఏర్పడితే అది వారికి ప్రాణాంతకమే.

10 పడకలతో డేకేర్

తలసేమియాతో బాధపడుతున్న వారికి చికిత్స అందించడానికి మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో 10 పడకలతో డే కేర్ సెంటర్ ఏర్పాటు చేశారు. గతేడాది నుంచి ఉమ్మడి జిల్లాకు చెందిన 158 మంది చిన్నారులు ఇక్కడ రిజిస్టర్ చేసుకున్నారు. ఇందులో తలసేమియా వ్యాధిగ్రస్తులకు రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. రక్తంతోపాటు ఉచితంగా మందులు ఇస్తున్నారు. ప్రతినెల రక్తం ఎక్కించడంతోపాటు రూ.1.50 లక్షల విలువ చేసే మందులు ఉచితంగా అందిస్తున్నారు. దీంతోపాటు చికిత్స కోసం వచ్చిన వారికి ఆహారం అందిస్తున్నారు. ఇటీవల తలసేమియా వ్యాధిని నిర్ధారణ చేయడానికి అవసరమైన మిషన్ రూ.35 లక్షలతో సమకూర్చారు. ఇక్కడ ఒక వైద్యాధికారి, ముగ్గురు స్టాఫ్‌నర్సులు, ఒక పెథాలజీ, చిన్నపిల్లల వైద్యుడు, ఫిజియోథెరిపిస్ట్, బ్లడ్‌బ్యాంకు సిబ్బంది అందుబాటులో ఉంటారు.

జీవితకాలం అంతే..

తలసేమియా వ్యాధి సోకిన బాధితులు జీవితకాలం రక్తం ఎక్కించుకోవాల్సిన పరిస్థితి ఉంటుంది. ప్రతి మూడు నుంచి నాలుగు వారాలకు ఒకసారి రక్తం ఎక్కించుకోకపోతే ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంటుంది. ఈ వ్యాధి సోకిన వారు ఉమ్మడి జిల్లాలో 172 మంది ఉండగా.. ఇందులో 98 శాతం మంది గ్రామీణ ప్రాంతాలకు చెందిన కూలీ పనులు చేసుకునే కుటుంబాల్లో ఉన్నారు. 2018లో తలసేమియాను ఆరోగ్యశ్రీ పథకంలో విలీనం చేయడం వల్ల బాధితులకు ప్రతినెలా మందులను జనరల్ ఆస్పత్రి నుంచి ఇస్తుంటే.. రక్తం మాత్రం రెడ్‌క్రాస్ సరఫరా చేస్తుంది.

30- 40 యూనిట్లు అవసరం



ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డే కేర్ సెంటర్‌లో ప్రతినెలా తలసేమియా బాధితుల కోసం 30- 40 యూనిట్ల రక్తం అవసరమవుతుంది. చికిత్స పొందుతున్న బాధితుల కోసం సెంటర్ ఏసీ, టీవీ ఇతర సౌకర్యాలు కల్పించారు. ప్రధానంగా చిన్నపిల్లలు, గర్భిణులు ఆరు నెలల పైబడిన వారికి ప్రత్యేక చికిత్స ఉంటుంది.

– రామకిషన్, జనరల్ ఆస్పత్రి సూపరింటిండెంట్, మహబూబ్‌నగర్

విరివిగా సేవా కార్యక్రమాలు



తెలంగాణ రాష్ట్రంలో మహబూబ్‌నగర్ రెడ్‌క్రాస్ ముందంజలో ఉంది. ఈ ఏడాది కాలంలో జిల్లాలో 7,496 యూనిట్ల రక్తం సేకరించాం. 137 మందికి సంబంధించి కళ్ల డోనెట్‌తోపాటు 18 మృతదేహాలను మెడికల్ కళాశాలకు అందించాం. తలసేమియా బాధితులకు అవసరమైన వారికి రక్తం అందిస్తున్నాం. అనాథ శరణాలయం, స్కూల్స్ ఇలా రెడ్‌క్రాస్ నుంచి అన్ని రకాల సేవా కార్యక్రమాలు చేపడుతున్నాం.

– నటరాజ్, రెడ్‌క్రాస్ చైర్మన్, మహబూబ్‌నగర్

పరీక్షలు చేయించుకోవాలి

ఈ వ్యాధి బారినపడిన వారు పసువు రంగులో మూత్ర విసర్జన చేస్తుండటం వల్ల దీనిని తల్లిదండ్రులు పచ్చకామెర్లుగా భావిస్తుంటారు. అవగాహన లేమి కారణంగా పర్చకారమెర్లకు చికిత్స అందిస్తుంటారు. ఇది సరైంది కాదు. పైలక్షణాలు పిల్లల్లో ఉంటే జనరల్ ఆస్పత్రిలో పూర్తిస్థాయి పరీక్షలు చేయించి చికిత్స చేయించుకోవాలి. వ్యాధి నిర్ధారణ అయ్యాక రక్తం సైతం తరచూ ఎక్కించుకోవడం వల్ల శరీరంలో ఐరన్ మోతాదు పెరిగిపోయి ప్రాణాపాయం బారినపడే ప్రమాదం ఉంది. అందుకే ప్రత్యేకంగా ఐరన్ కిలేషన్ చికిత్స తీసుకోవాలి.


ఇవీ లక్షణాలు..

- తల్లిదండ్రుల్లో ఏ ఒక్కరికైనా ఈ వ్యాధి ఉంటే, పిల్లలకు సంక్రమించే అవకాశం ఉంది. ఎదుగుతున్న కొద్దీ బయటపడుతుంది.
- వ్యాధి బారినపడిన పిల్లలకు రక్తహీనత మొదలై జీర్ణశక్తి మందగిస్తుంది.
- ముఖం పాలిపోవడం, ఎదుగుదల లేకపోవడం, హుషారు తగ్గడం, నీరసించిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.
- కీళ్ల నొప్పులు, కడుపు నొప్పి ప్రారంభమై, మూత్రం పసుపు వర్ణంతో వస్తుంది.

వ్యాధికి కారణాలు..

- దగ్గరి బంధువుల పిల్లలను వివాహం చేసుకోవడం వల్ల వారికి పుట్టే పిల్లలకు వ్యాధి సోకే ప్రమాదం ఉంది.
- ఈ వ్యాధిగ్రస్తులను లేదా వ్యాధి వాహకులుగా ఉన్నవారిని వివాహం చేసుకున్నా.. పిల్లలకు సోకే ప్రమాదం లేకపోలేదు.





రోడ్డు ప్రమాదం.. కుటుంబం చిన్నాభిన్నం

- తండ్రి, కూతురు.. మరో వ్యక్తి దుర్మరణం
- తల్లి పరిస్థితి విషమం
- స్వల్ప గాయాలతో బయటపడ్డ ఏడు నెలల బాలుడు
- పెద్ద మొల్గర సమీపంలో ఘటన



కొత్త మొల్గర సమీపంలో ఘటనా స్థలం వద్ద ఇలా..

భూత్పూర్: ఆనందంగా జీవిస్తున్న ఆ కుటుంబాన్ని రోడ్డు ప్రమాదం చిన్నాభిన్నం చేసింది. భార్యాభర్తలు తమ మూడేళ్ల పాప, ఏడు నెలల బాబుతో కలిసి బైక్‌పై వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. దీంతో తండ్రి, మూడేళ్ల పాప మృత్యువాతపడగా తల్లి తీవ్రంగా గాయపడింది. అమ్మ ఒడిలో ఉండటంతో ఏడు నెలల బాబు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఇలా రోడ్డు ప్రమాదం ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనకు సంబంధించి ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని కప్పెటకు చెందిన సంధ్య, వడ్డె భాస్కర్(28), కూతురు పావని(3), కుమారుడు రిత్విక్ (7 నెలల బాబు)తో కలిసి ఆదివారం ద్విచక్రవాహనంపై బిజినేపల్లికి వెళ్లి సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో కొత్త మొల్గర సమీపంలోని పేపర్ మిల్లు వద్ద ఎదురుగా భూత్పూర్ నుంచి ఎల్కిచర్లకు మోటార్‌సైకిల్‌పై వస్తున్న ఖాసీం(40) ఎదురెదురుగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఖాసీం, చిన్నారి పావని అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. సంధ్య, భాస్కర్ పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా భాస్కర్ మార్గమధ్యలోనే మృతిచెందాడు. ఒకే కుటుంబంలో ఇద్దరు మృతిచెందడం, మరొకరు తీవ్రంగా గాయపడడంతో కప్పెటలో విషాదఛాయలు అలుముకున్నాయి. అయితే, అటు తండ్రి మృతి, ఇటు తల్లి తీవ్రగాయాల పాలవడంతో ఏడేళ్ల బాలుడు బంధువుల వద్ద ఉన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆటో చెట్టును ఢీకొని మరొకరు..



అమరగిరి శివారులో గాయాలపాలైన ప్రయాణికులు

వనపర్తి: ప్యాసింజర్ ఆటో చెట్టును ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతిచెందగా.. మరో ముగ్గురు గాయాలపాలయ్యారు. రూరల్ ఎస్‌ఐ రామరాజు కథనం ప్రకారం.. వనపర్తి నుంచి పానగల్ మండలం దొండాయపల్లికి ఏడుగురి ప్రయాణికులతో వెళ్తున్న ఆటో అంజనగిరి శివారులో రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న భగీరథమ్మ(60), చంద్రమ్మ, శేఖరయ్యగౌడ్, భీమమ్మలకు గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను వనపర్తి జనరల్ ఆస్పత్రికి తరలిస్తుండగా భగీరథమ్మ మార్గమధ్యలోనే మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

వచ్చే ఎన్నికల్లో ఓటుతోనే బుద్ధి చెబుతారు



మహబూబ్‌నగర్‌లో మంత్రులు దిష్టిబొమ్మ దహనం చేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: రేవంత్‌రెడ్డిపై వ్యాఖ్యలకు నిరసనగా మహబూబ్‌నగర్ యువజన కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు జె.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాకేంద్రం న్యూటౌన్‌లోని మల్లికార్జున్ చౌరస్తాలో మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, కేటీఆర్‌ల దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా మంత్రులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరసనలో పాల్గొన్న రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి మాట్లాడుతూ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, కేటీఆర్‌ల అనుచిత వ్యాఖ్యలను తెలంగాణ యువజన కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. రేవంత్‌రెడ్డి ఎన్నడూ కులాల ప్రస్తావన తీసుకురాలేదన్నారు. రేవంత్‌రెడ్డి పట్ల అనుచితంగా, తప్పుగా మాట్లాడినా సహించేది లేదని, యువజన కాంగ్రెస్ నాయకులు ఎక్కడికక్కడే అడ్డుకుంటామన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటుతోనే ప్రజలు బుద్ధిచెబుతారని ఆయన హెచ్చరించారు. నిరసనలో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రశేఖర్, పట్టణ యువజన అధ్యక్షుడు ఎండి.సల్మాన్, నాయకులు సిరాజ్ ఖాద్రీ, రాఘువేందర్ యాదవ్ పాల్గొన్నారు.



చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



గిడ్డన్న (ఫైల్)

ఎర్రవల్లిచౌరస్తా: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన కోదండాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటస్వామి కథనం ప్రకారం.. మానవపాడు మండలంలోని పల్లెపాడుకు చెందిన వడ్డె గిడ్డన్న(43), భార్య పద్మతో కలిసి ద్విచక్ర వాహనంపై శనివారం ఎర్రవల్లి చౌరస్తాకు బయలుదేరారు. ఈ క్రమంలో సాసనూలు సమీపంలోకి రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనున్న కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టడంతో వడ్డె గిడ్డన్నకు తీవ్ర గాయాలు కాగా.. చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతిచెందాడు. ఈ ఘటనపై గిడ్డన్న భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. గిడ్డన్న రెండు రోజుల క్రితమే కూతురికి వివాహం చేయగా.. పందిరి కూడా విప్పకముందే తండ్రి మృతిచెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

బాలిక ఆత్మహత్య

భూత్పూర్: మున్సిపాలిటీలోని పదో వార్డులో భవాని(14) అనే బాలిక ఆదివారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన జయరాం గత 20 ఏళ్ల క్రితం భూత్పూర్‌కు వచ్చి జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో భూత్పూర్ చౌరస్తాలో తోపుడు బండిపై మిర్చి, స్వీట్ తయారీ చేస్తుండేవాడు. ఆదివారం జయరాంతోపాటు భార్య పని నిమిత్తం మహబూబ్‌నగర్ వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలిక ఫ్యాన్‌కు ఉరేసుకుంది. సాయంత్రం ఇంటికి వచ్చిన జయరాం దంపతులు తలుపులు ఎంత కొట్టినా తెరవకపోవడంతో పక్కనే ఉన్న కిటికీలో నుంచి చూడగా కూతురు భవాని ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. భవాని మృతికి గల కారణాలు తెలియరాలేదని ఎస్‌ఐ తెలిపారు.

చిన్నారిపై దాడి: కేసు నమోదు

మల్దకల్: తోటలో పండ్లు కోసిందంటూ ఓ చిన్నారిని గొలుసుతో కట్టి దాడి చేసిన తోట యజమానురాలిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ ఈశ్వరయ్య తెలిపారు. మండలంలోని విఠలాపురం గ్రామానికి చెందిన మహేందర్‌రెడ్డి సతీమణి స్నేహలత చీని పండ్లు కోసిందని శనివారం గ్రామానికి చెందిన బాలిక పట్ల అమానవీయంగా ప్రవర్తించిన తీరుపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై చిన్నారి ప్రవళిక తండ్రి కుర్వ గోకారన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చెక్‌పోస్టుల తనిఖీ ముమ్మరంగా చేపట్టాలి



జలాల్‌పూర్ చెక్‌పోస్టును పరిశీలిస్తున్న నారాయణపేట ఎస్పీ వెంకటేశ్వర్లు

నారాయణపేట రూరల్: జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో ఆదివారం వాహనాల తనిఖీ ముమ్మరంగా కొనసాగింది. కర్ణాటక రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మరింత పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. జిలాల్‌పూర్, ఎక్లాస్‌పూర్, చేగుంట, కాన్‌కుర్తి, సమస్తాపూర్, కృష్ణ బ్రిడ్జి దగ్గర అన్ని వాహనాలను విస్తృతంగా పరిశీలించి పంపిస్తున్నారు. ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు పలు చెక్‌పోస్టులను తనిఖీ చేసి మాట్లాడారు. ఇక కర్ణాటక ఎన్నికల్లో కీలక సమయం ఆసన్నమైందని, ఎంతో అప్రమత్తంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. ఎలాంటి మద్యం, డబ్బులతో పాటు వస్తువులు అక్రమంగా రవాణా జరగకుండా గట్టి చర్యలు చేపట్టాలన్నారు. బోగస్ ఓటర్లను తరలించే అవకాశం ఉండటంతో వాటి విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే వదిలి పెట్టాలన్నారు. నగదు, మద్యం, వస్తువుల రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు వాహనాల్లో వెళ్తుంటే పూర్తి విచారణ చేపట్టాలన్నారు.

జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్

జడ్చర్ల: పట్టణ పరిధిలో ఆదివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. భూత్పూర్ మండలం దివిటిపల్లి వద్ద జాతీయ రహదారిపై బ్రిడ్జి విస్తరణ పనులు కొనసాగుతున్న క్రమంలో అక్కడ వన్ వే కొనసాగుతుంది. ఈ క్రమంలో ఇదే వంతెనపై ఓ వాహనం టైర్ పేలి అక్కడే నిలిచిపోవడంతో అటు ఇటుగా ట్రాఫిక్ జామ్ ఏర్పడినట్లు తెలిసింది. దీంతో దాదాపు 2 గంటలపాటు వాహనాలు నెమ్మదిగా ముందుకు కదిలాయి.

శ్రీరస్తు.. శుభమస్తు..

- వైభవంగా సామూహిక వివాహాలు
- అలివేలుమంగమ్మ సన్నిధిలో ఒక్కటైన 21 జంటలు
- నూతన జంటలకు అండగా ఉంటా: మంత్రి శ్రీనివాస్‌గౌడ్



అరుంధతి నక్షత్రం చూపిస్తున్న నూతన జంటలు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీఅలివేలుమంగతాయారు అమ్మవారి సన్నిధి సామూహిక వివాహాల నిర్వహణతో సందడిగా మారింది. శాంతానారాయణగౌడ్, శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి చారిటబుల్ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం 21 పేద జంటలకు మొట్టమొదటి సారిగా సామూహిక వివాహాలు జరిపించారు. కార్యక్రమానికి రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై నూతన జంటలను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వచ్చే ఏడాది అమ్మవారి ఆలయం వద్ద ఏసీ కల్యాణ మండపం రాబోతుందని, ఇక్కడ సామూహిక వివాహాలను అంగరంగ వైభవంగా జరిపిస్తామని చెప్పారు. అలాగే పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పెద్ద బడ్జెట్ హోటల్ కం కన్వెన్షన్ సెంటర్ నిర్మిస్తామన్నారు. ఇప్పటికే కొండపైన 18 గదుల వసతి సముదాయాన్ని నిర్మించామని, ఇంకా 20 గదుల సముదాయాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. సామూహిక వివాహాలు జరిగిన 21 జంటలకు తాము అన్ని విధాలా అండగా ఉంటామని మంత్రి భరోసా కల్పించారు. వారితో త్వరలో తమ నివాసంలో సహపంక్తి భోజనం చేసి వారి కష్ట సుఖాలను తెలుసుకోవడమే కాకుండా వారికి త్వరలో రాబోయే పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలను కల్పిస్తామన్నారు.



నూతన వధూవరులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ప్రత్యేక పూజలు..

మన్యంకొండలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సతీసమేతంగా ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఆలయం వద్ద చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్‌తో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, ముడా చైర్మన్ వెంకన్న, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, ఎంపీపీ సుధాశ్రీ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, రైతుబంధు మండలాధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, ముడా డైరెక్టర్ ఆంజనేయులు, ఓబ్లాయిపల్లి సర్పంచ్ చంద్రకళ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు అల్లావుద్దీన్, నాయకులు రవీందర్‌రెడ్డి, రాఘువేందర్‌గౌడ్, వెంకటస్వామి పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

DANCE

- DHOOM DANCE STUDIO. Main Branch: New Town, More Branches in Mahabubnagar. Master A. AZEEM, Cell: 9912136691.

WANTED

- రేమండ్ షోరూమ్, జడ్చర్ల, నాగర్‌కర్నూల్, వనపర్తిలో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్, స్టోర్ ఇంఛార్జ్, సేల్స్ ఇంఛార్జ్ కావలెను. సెల్:8492801999, 08543796686.
- శివమ్ మోటార్స్ మహబూబ్‌నగర్‌లో పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, రిసెప్షనిస్ట్, టెక్నీషియన్, ఆఫీస్ బాయ్ కావలెను. సెల్:9491402020, 6281108441.
- హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ. 16K-18K ఏజెంట్ కమీషన్ 8K. ఫోన్ : 9640258899
- పర్మినెంట్ జాబ్స్, ప్రముఖ సంస్థ నందు డేటా ఎంట్రీ ఆపరేటర్స్, సూపర్‌వైజర్, క్లర్క్స్, ఆఫీస్ బాయ్స్ కావలెను. Qul: 5 to డిగ్రీ, జీతం: 15000 to 35000 ఫోన్ : 9440828190

WATCHMEN NEEDED

- మహబూబ్‌నగర్ పట్టణంలో నిర్మాణములో ఉన్న ఇంటికి S.S.C చదివిన ఒక వాచ్‌మెన్ కావలెను. సెల్ నం. 8686967001.

సాక్షి భవిత విద్యార్థుల కోసం

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!

సాక్షి క్లాసిఫైడ్స్

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు నాలుగు లైన్లకు రూ. : 200/- (Black & White)

అదనపు లైనుకు రూ. : 50 మాత్రమే

5% GST అదనం

వివరాలకు :

మహబూబ్‌నగర్	: 9010234478
	9010522215
	9705135557
	9010869797
జడ్చర్ల	: 9010076222
నాగర్‌కర్నూల్	: 9010006785
వనపర్తి	: 9010068317
గద్వాల	: 9553955603
నారాయణపేట	: 9010962007

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటి నిజానిజాలు పరిశీలించిన పిదప ప్రత్యుత్తరం ఇవ్వాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ ఖాతాల ద్వారా డబ్బుల ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయునప్పుడు పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి మేనేజర్

క్లుప్తంగా...



తిరుమల శ్రీవారి ఆలయంలో ధ్వజస్తంభాన్ని మొక్కుతున్న మైసూర్ దత్తపీఠం గణపతి సచ్చిదానంద స్వామీజీ

తిరుమల యాత్ర ఫ్యాషన్‌తో చేసే పిక్నిక్ కాదు

- భక్తితో శ్రీవారిని దర్శించుకోవాలి
- మైసూర్ దత్తపీఠం గణపతి సచ్చిదానంద స్వామీజీ

తిరుమల: తిరుమల యాత్ర ఫ్యాషన్‌తో చేసే పిక్నిక్ కాదని, భక్తితో శ్రీవారిని దర్శించుకోవాలని మైసూర్ దత్తపీఠం గణపతి సచ్చిదానంద స్వామీజీ పేర్కొన్నారు. ఆదివారం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. తిరుమల శ్రీవారిని వ్యాపార దృష్టితో చూడకూడదని చెప్పారు. భక్తితో స్వామివారిని పూజిస్తే అందరి కోరికలు తీరుతాయన్నారు. పవిత్రమైన తిరుమల పరిసరాలను భక్తులు అపవిత్రం చేయకూడదని సూచించారు.

బండిపై పోస్ట్ పెట్టిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి: బీజేపీ

సాక్షి, హైదరాబాద్ : సామాజిక మాధ్యమాల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చనిపోయారని పోస్టు చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని ఆ పార్టీ డిమాండ్ చేసింది. రాష్ట్ర మంత్రి కేటీఆర్ ప్రొఫైల్, టీఆర్ఎస్ పేరుతో ఉన్న ఆ ఫేస్‌బుక్ అకౌంట్ నుంచి ఆ పోస్టు వైరల్ అయిందని, ఆ పోస్టు పెట్టిన వ్యక్తిని 24 గంటల్లోగా అరెస్టు చేయాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణీ రుద్రమదేవి ఆదివారం డీజీపీని కోరారు. పార్టీ అధికార ప్రతినిధి సీహెచ్ విఠల్‌తో కలిసి ఆమె మీడియాతో మాట్లాడుతూ...బతికున్న బీజేపీ నేతలనే చనిపోయారని పోస్టులు పెట్టే స్థాయికి బీఆర్ఎస్ నేతలు దిగజారిపోయారని మండిపడ్డారు. కరీంనగర్ ప్రజలు పిచ్చోడిని గెలిపించారని మంత్రి కేటీఆర్ అహంకారంతో మాట్లాడుతున్నారని ఇప్పటికైనా ఆయన నోరు అదుపులో పెట్టుకుంటే మంచిదని హితవు పలికారు. పదవీ విరమణ పొందకుండా సోమేశ్ కుమార్ రాజకీయాల్లో ఎలా తిరుగుతున్నారని ప్రశ్నించారు. ఈ విషయంలో సోమేశ్ కుమార్‌పై ఫిర్యాదు చేస్తామన్నారు.

ఆర్థిక నేరాలకు | మార్గదర్శితో ముగింపు!

రిజిస్టర్ చేయకుండా చిట్‌ఫండ్ నడిపిన కేసులో 4 రోజుల పాటు అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో రామోజీ

- కోర్టుల్ని తప్పుదారి పట్టించేలా లెక్కలు చూపించారు
- ఫిర్యాదులు రాకున్నా న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే
- రామోజీరావు కేసు ముగిసిన కథ అనుకున్నాం
- సీఎం జగన్ ఎస్‌ఎల్‌పీ పిటిషన్ వేయడంతో కేసుకు ఊపిరి వచ్చింది
- టీడీపీకి ఆదిరెడ్డి అప్పారావు అవసరం లేదు.. రామోజీనే ముఖ్యం
- రామోజీ – మార్గదర్శి అక్రమాలపై విశాఖలో 'స్వర్ణాంధ్ర వేదిక' సదస్సులో వక్తలు



సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్.

సాక్షి, విశాఖపట్నం: రిజిస్టర్ చేయకుండా చిట్‌ఫండ్ నిర్వహించిన కేసులో మార్గదర్శి చైర్మన్ చెరుకూరి రామోజీరావు గతంలో నాలుగు రోజుల పాటు హైదరాబాద్ అబిడ్స్ పోలీస్ స్టేషన్‌లో ఉన్నారని, అప్పటి నుంచి ఆయన మోసాలు కొనసాగుతూనే ఉన్నాయని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ వెల్లడించారు. మార్గదర్శి కేసుతోనైనా దేశంలో ఆర్థిక నేరాలకు ఫుల్‌స్టాప్ పడాలని వ్యాఖ్యానించారు. 17 ఏళ్లుగా కొనసాగుతున్న మార్గదర్శి కేసు ఇక ముగిసిన అధ్యాయం అనుకున్న తరుణంలో డిపాజిట్‌దారుల ప్రయోజనాలను కాపాడుతూ సీఎం వైఎస్ జగన్ వేసిన ఎస్‌ఎల్‌పీ పిటిషన్‌తో కొత్త ఊపిరి వచ్చిందని, లక్షల మంది ఖాతాదారులకు ధైర్యం వచ్చిందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. విశాఖలోని ఓ హోటల్‌లో ఆదివారం సాయంత్రం స్వర్ణాంధ్రవేదిక ఆధ్వర్యంలో 'రామోజీరావు మార్గదర్శి అక్రమాలు– నిజానిజాలు'అనే అంశంపై నిర్వహించిన సదస్సులో పలువురు మాట్లాడారు.

అబిడ్స్ స్టేషన్‌లో రామోజీ..

ఈనాడుకు మొట్టమొదటి ఎడిటర్ ఉన్న ఏబీకే ప్రసాద్‌కు ఫోన్ చేస్తే.. ఏ పర్మిషన్ లేకుండా చిట్ ఫండ్ కంపెనీ నడుపుతున్నారన్న ఆరోపణలపై రామోజీరావు నాలుగు రోజుల పాటు అబిడ్స్ పోలీస్ స్టేషన్‌లో ఉన్నారన్న కొత్త విషయాన్ని చెప్పారు. ఆ తర్వాతే మార్గదర్శిని రిజిస్టర్ చేశారట. జీవీ రెడ్డి మార్గదర్శిపై చర్చకు వస్తామని ప్రకటించారు. కానీ హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌ని ఈ నెల 14న టీడీపీ అఫీషియల్ స్పోక్స్ పర్సన్ పేరుతో బుక్ చేసుకున్నారు. రామోజీ కోసం ఏమైనా చేస్తామని తద్వారా టీడీపీ నేరుగానే చెబుతోంది.

ఎవరికి ఫిర్యాదు చేయాలి?: ఉండవల్లి అరుణ్‌కుమార్, మాజీ ఎంపీ

17 ఏళ్ల తరువాత డబ్బులు ఎవరికి ఇచ్చారో వెల్లడించాలని మార్గదర్శిని సుప్రీంకోర్టు ఆదేశించడంతో ఘన విజయం సాధించామని చెప్పుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నాం. జూలై 18కి కేసు వాయిదా వేశారు. చాలా ఏళ్ల న్యాయస్థానాల్లో కేసు ఏమిటనేది వినే పరిస్థితి రాలేదు. 2021లో హైకోర్టులో కేసు కొట్టివేసిన తర్వాత ఎస్‌ఎల్‌పీ (స్పెషల్ లీవ్ పిటిషన్)దాఖలు చేశా. ఏడాది తర్వాత ఏపీ ప్రభుత్వం నేరుగా ఎస్‌ఎల్‌పీ వేసింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరైన టైమ్‌లో స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం అఫిడవిట్ వేయడంతో నాకు నమ్మకం వచ్చింది. ఈ కేసు కథ ముగిసిపోతుందనుకున్న తరుణంలో వైఎస్ జగన్ వేసిన ఎస్‌ఎల్‌పీతో మళ్లీ మొదలైంది. దివంగత వైఎస్సార్ అనుకున్నది రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి చేయలేకపోయారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం.. ఎవరికి డబ్బులు చెల్లించారనే వివరాలు బయటకు వస్తే ఈ కేసు ఈడీకి వెళ్తుందా? మనీ ల్యాండరింగ్‌కు కిందకు వెళ్తుందా? చెల్లించిన డిపాజిటర్లు ఎవరు? అనే విషయాలు బయటకు వస్తాయి. మొత్తం 2.36 లక్షల మంది పేర్లు బయటికి వస్తాయి. దీన్ని వచ్చే ఎన్నికల్లో ఇష్యూ చేయాలన్నదే చంద్రబాబు లక్ష్యంగా కనిపిస్తోంది. ఎవరూ కంప్లెయింట్ ఇవ్వలేదని రామోజీ అంటున్నారు. చిట్ డబ్బులు ఇవ్వకపోతే ఎవరికి ఫిర్యాదు చేయాలి? పోలీస్ స్టేషన్‌లో ఇస్తే తీసుకుంటారా? కలెక్టరేట్‌లో తీసుకుంటారా?

రెండు దశాబ్దాల నిరంకుశత్వం

రామోజీ మార్గదర్శకత్వంలో నిర్వహిస్తున్న మార్గదర్శితో ఈ వేదికపై ఉన్నవారెవరికీ వ్యక్తిగత ద్వేషాలు లేవు. ఈనాడైనా.. చిత్తు కాగితాలైనా.. పచ్చళ్లయినా.. పరిశ్రమలైనా.. చిట్స్ అయినా.. తానే చేయాలన్నదే రామోజీరావు కాన్సెప్ట్. చిన్నవాడెవడూ బతకకూడదు. ఆయనకి యాడ్స్ ఇవ్వకపోతే వ్యతిరేకంగా వార్తలు రాయడం నిత్యకృత్యమైంది. అధికార శక్తి, మీడియా శక్తి ఏకమైతే ఎంత భయంకరంగా ఉంటుందో గత రెండు దశాబ్దాలుగా రామోజీ రూపంలో చూస్తున్నాం. మార్గదర్శి అక్రమాలపై త్వరలో తిరుపతిలో సదస్సు నిర్వహిస్తాం.

– కేబీజీ తిలక్, స్వర్ణాంధ్ర దినపత్రిక ఎడిటర్

'చంద్రమతి మాంగల్యం'.. మార్గదర్శి ఆస్తులు!

డిపాజిటర్లు మోసపోకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం సక్రమంగా వ్యవహరించి డిపాజిటర్లను కాపాడింది. కొత్త అప్పులు రెండు లక్షల మందికిపైగా డిపాజిటర్లకు గుదిబండగా మారనున్నాయి. అనుబంధ కంపెనీలకు నిధులు ఎలా బదలాయిస్తారు? 'చంద్రమతి మాంగల్యం' మాదిరిగా ఆస్తులు వారికి మినహా ఇతరులకు కనపడటం లేదు. అగ్రిగోల్డ్, సహారా మోసాలు జరిగిపోయాయి. డిపాజిట్ రసీదుపై రామోజీరావు సంతకం ఉంటుంది. డిశ్చార్జ్ రసీదుపై ప్రొప్రైటర్ సంతకం చేయడం నిబంధనలకు విరుద్ధం.

– శర్మ, ప్రముఖ న్యాయవాది.

అదే బాటలో ధనలక్ష్మి, కార్తికేయ...

రామోజీని చూసి మిగిలిన చిట్స్ కూడా మోసాల బాట పడుతున్నాయి. రామోజీ ఏం చేస్తున్నారో అందరూ అదే చేస్తున్నారు. మూడు నెలల క్రితం కాకినాడలో ధనలక్ష్మి సొసైటీ, నెల క్రితం కార్తికేయ సొసైటీ మూతపడ్డా పోలీసులు ఏమీ చేయలేకపోయారు. ఎర్రన్నాయుడి వియ్యంకుడైన ఆదిరెడ్డి అప్పారావు, ఆయన కుమారుడిని ఇదే మోసం కారణంగా అరెస్టు చేశారు. రామోజీని అరెస్ట్ చేయవద్దంటూ హైకోర్టు తీర్పు వచ్చింది. మరి అలాంటప్పుడు అప్పారావును ఎందుకు అరెస్టు చేశారని ఆయన్ను పరామర్శించేందుకు వచ్చిన చంద్రబాబు ఎందుకు ప్రశ్నించలేదు? ఇద్దరికీ చెరో నీతా? రామోజీని ఇంటికెళ్లి విచారిస్తారు.. అప్పారావును ఎందుకు అరెస్టు చేస్తారు? అని అడగాలి కదా! ఆదిరెడ్డి అప్పారావు ఏమైనా పర్వాలేదు కానీ రామోజీకి ఏమీ జరగకూడదని టీడీపీ స్టాండ్ తీసుకుంది.



సదస్సుకు హాజరైన ప్రముఖులు

బ్రహ్మయ్య కంపెనీలో వందల ఫిర్యాదులు

మార్గదర్శి, డాల్ఫిన్, ప్రియా ఫుడ్స్, ఈనాడుతో 1979 నుంచి నాకు అనుబంధం ఉంది. ఉండవల్లి పోరాటం జరిగిన తర్వాత రామోజీ మోసాలు ప్రతి ఒక్కటీ గుర్తుకొచ్చాయి. 100 టన్నుల న్యూస్ ప్రింట్ పేపర్ దిగుమతి చేసుకుంటే 90 టన్నులు మాత్రమే వినియోగించేవారు. ఇలాంటి ఎన్నో మోసాలు నా కళ్లముందే జరిగాయి. మా మామయ్య కేఎస్ రెడ్డి అన్నదాత ఎడిటర్‌గా ఉండేవారు. రామోజీ ప్రజల డబ్బులతో హోటల్స్.. ప్రింటింగ్ ప్రెస్‌లు, బిల్డింగ్‌లు కడుతున్నారని, చివరకు ఏమవుతుందోనని మామయ్య ఆందోళన చెందేవారు. చట్టాల్లో లొసుగులను అడ్డు పెట్టుకొని తప్పించుకోవడం రామోజీరావుకి వెన్నతో పెట్టిన విద్య. టీడీపీ నుంచి వచ్చిన జీవీ రెడ్డికి, మార్గదర్శికి ఏం సంబంధం? మా గ్రామంలో ఒక వ్యక్తికి చిట్ అయిపోయిన 9 ఏళ్ల తర్వాత డబ్బులిచ్చారు. నేను ఆడిట్ చేసిన సమయంలో బ్రహ్మయ్య అండ్ కంపెనీలో మార్గదర్శిపై కొన్ని వందల కంప్లెయింట్స్ ఉన్నాయి.

– నాగార్జునరెడ్డి, ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్

అధికారంలోకి రాగానే 2 లక్షల ఉద్యోగాలు

- 11న సంగారెడ్డిలో నిరుద్యోగ మార్చ్
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్ : బీజేపీ అధికారంలోకి రాగానే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పేర్కొన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తామని గత ఎన్నికల్లో ఇచ్చిన మాట తప్పిన కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించేదాకా పోరాడుతామన్నారు. ఇందులోభాగంగా ఈనెల 11న ఉమ్మడి మెదక్ జిల్లా కేంద్రంలోని సంగారెడ్డిలో నిర్వహిస్తున్న 'నిరుద్యోగ మార్చ్'కు నిరుద్యోగులు, ప్రజాస్వామికవాదులు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ పేరుతో నిరుద్యోగులను మోసం చేసిన తీరును 'నిరుద్యోగ మార్చ్'ద్వారా ప్రజల్లో ఎండగడతామని తెలిపారు. వచ్చే నెలలో హైదరాబాద్ లో ''మిలియన్ మార్చ్''నిర్వహించి ప్రభుత్వానికి కళ్లు తెరిపిస్తామన్నారు. పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేటీఆర్ మంత్రి పదవికి రాజీనామా చేసేదాకా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూపీఎస్సీ తరహాలో ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తామని హామీనిచ్చారు.

అల్లూరికి నివాళి..

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యాయంలో అల్లూరి చిత్రపటానికి కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీనాయకులు చింతల రామచంద్రారెడ్డి, గౌతమ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి మహారాష్ట్ర నేతలు

సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్రకు చెందిన 'భూమి పుత్ర సంఘటన'బీఆర్ఎస్ పార్టీలో ఆదివారం నాడు విలీనమైంది. సంఘటన సంస్థాపక అధ్యక్షుడు సంతోష్ వాడేకర్‌తో పాటు సంఘం నేతలు.. కిరణ్ వాబాలే, అవినాశ్ దేశ్‌ముఖ్, అశోక్ అందాలే, రాజన్ రోక్డే, ఆసిఫ్ బాయి షేక్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సమాధాన్ అరికొండ, ఆప్‌కి చెందిన దీపక్ కొంపెల్వార్, యోగితా కొంపెల్వార్, రాము చౌహాన్, భారీ త్రిలోక్ జైన్, సంతోష్ కాంబ్లే, అఖిల్ భారతీయ క్రాంతి దళ్ సంఘటనకు చెందిన లక్ష్మీకాంత్ భంగే కూడా బీఆర్ఎస్‌లో చేరారు. నిఖిల్ దేశ్‌ముఖ్ ఆధ్వర్యంలో.. గోండ్వానా పార్టీ విదర్భ అధ్యక్షుడు ప్రణీత వీకేసీ, యావత్మాల్‌కు చెందిన సామాజిక కార్యకర్త వర్ష కాంబ్లే కూడా బీఆర్ఎస్‌లో చేరారు. విదర్భకు చెందిన మహిళా బచత్ ఘాట్ మహిళా కమిటీ అధ్యక్షురాలు కల్పన, పూనమ్ అలోర్‌లు.. బీఆర్ఎస్‌కు తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బాల్క సుమన్ పాల్గొన్నారు.

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఆదివారం సాయంత్రం 3,656 క్యూసెక్కుల వరద నీరు కొనసాగింది. నాలుగు రోజుల నుంచి ప్రాజెక్టుకు దాదాపు 2 టీఎంసీల నీరు చేరినట్లు అధికారులు తెలిపారు. జూరాల ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా... రాత్రి ఏడు గంటల వరకు ప్రాజెక్టులో 5.760 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టు నుంచి 126 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

స్వల్పంగా పెరుగుదల

దోమలపెంట: కురుస్తున్న వర్షాలు వలన నీటి క్యాచ్‌మెంట్ ఏర్పడి శ్రీశైలం జలాశయంలో మూడపాయింట్ల నీటిమట్టం పెరిగింది.ఆదివారం నీటిమట్టం 807.9 అడుగులు, 33.1089 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

బీజేపీ పాలనలోనే ప్రజల మధ్య విద్వేషాలు



మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ

మహబూబ్‌నగర్ రూరల్: దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కులం మతం పేరుతో విద్వేషాలు రెచ్చగొడుతూ ప్రజల మధ్య చిచ్చుపెడుతుందని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ అన్నారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కావలి పరశురాం అధ్యక్షతన కేవీపీఎస్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని తీసివేసి మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తుందన్నారు. దళితులు దీనిని తీవ్రంగా ప్రతిఘటించాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ల ప్రకారం ఖాళీ ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీపరం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ రెండో విడత దళితబంధు నియోజకవర్గానికి 1500 ఇవ్వాలని, ఇంటి స్థలం ఉన్న వారికి సొంత ఇల్లు నిర్మించుకోవడానికి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం తమ సంఘం ఆధ్వర్యంలో ఐక్య ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. దళితబంధు పేరుతో ఎస్సీ కార్పొరేషన్ పెండింగ్ రుణాల విడుదల చేయడం లేదని, 2021–22 పెండింగ్ రుణాల వెంటనే విడుదల చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎం.కుర్మయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు మాణిక్యం రాజు, లక్ష్మిదేవి, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్రాములు, ఆదివిష్ణు, సత్యం, రాములు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతు బే(బ)జార్..



మూతపడిన రైతుబజార్ కేంద్రం

- నిరుపయోగంగా పెడ్లు, షాపింగ్ కాంప్లెక్స్
- రూ.3.75 కోట్లతో అన్ని హంగులతో నిర్మాణం
- కూరగాయల విక్రయాలకు ముందుకు రాని వైనం
- సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి కేటాయిస్తే ఉపయోగం

జడ్చర్ల: ప్రభుత్వం కూరగాయల రైతుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన రైతుబజార్ మూణ్నాళ్ల ముచ్చట తీరకముందే మూతపడింది. సరిగ్గా ఐదేళ్ల క్రితం ప్రారంభించిన రైతుబజార్ కథ ఆదిలోనే కంచికి చేరింది. రైతులకు, వినియోగదారులకు అందుబాటులో రైతుబజార్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎన్నో సంవత్సరాలుగా ఉన్న నేపథ్యంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో వ్యవసాయ శాఖకు సంబంధించిన గోదాంలను మార్కెటింగ్ శాఖకు బదలాయించి అక్కడ రూ.3.75 కోట్ల వ్యయంతో అన్ని హంగులతో రైతుబజార్ ఏర్పాటు చేశారు. రెండు షెడ్లలో దాదాపు 50 మంది రైతులు ఏకకాలంలో తమ ఉత్పత్తులను విక్రయించుకునే విధంగా సిట్టింగ్ సదుపాయం ఉంది. అదేవిధంగా ఆరుబయట 15 దుకాణాలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి తాము పండించిన కూరగాయలను రైతులు నేరుగా ఇక్కడికి తీసుకువచ్చి విక్రయించుకునే అవకాశం ఉంది.

రైతుల విముఖత

బాదేపల్లిలో ఏర్పాటు చేసిన రైతు బజార్ కాంప్లెక్స్‌లో కూరగాయలను విక్రయించేందుకు రైతులు సుముఖత వ్యక్తం చేయలేదు. ఎందుకంటే ఇక్కడికి వినియోగదారులు వచ్చి కూరగాయలను కొనుగోలు చేసే పరిస్థితి లేకపోవడంతో రైతులు అక్కడికి వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. అంతేగాక బాదేపల్లి మున్సిపాలిటీ కాంప్లెక్స్‌లో ప్రస్తుతం కొనసాగుతున్న హోల్‌సేల్, రిటైల్ కూరగాయల దుకాణాలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. దీంతో చాలా లోపల ఉన్న రైతుబజార్‌కు వచ్చి కూరగాయలు కొనుగోలు చేసే పరిస్థితిలో వినియోగదారులు లేరు. రైతులు పొద్దస్తమానం రైతబజార్‌లో కూర్చున్నా కొనుగోళ్లు జరగడం లేదని గమనించిన రైతులు అటువైపే వెళ్లకపోవడంతో రైతుబజార్ మూతపడింది.

ఆదిలోనే హంసపాదు..

రైతుబజార్ ఏర్పాటు ఆదిలోనే హంసపాదు చందగా తయారైంది. 2018 ఏప్రిల్ 20న స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి లాంఛనంగా రైతుబజార్‌ను ప్రారంభించారు. అనంతరం కొన్ని రోజులు అడపాదడపా రైతులు ఇక్కడికి వచ్చారు. స్థానిక మున్సిపల్ అధికారులు సైతం రోడ్లపైన కూరగాయల విక్రయాలను అడ్డుకుని బలవంతంగా రైతుబజార్ వైపు మళ్లించే ప్రయత్నం చేశారు. కానీ, అక్కడికి వెళ్లి కొనేవారు కరువవడంతో రైతుబజార్‌లో క్రయవిక్రయాలు ముందుకు సాగక లక్ష్యం దెబ్బతింది.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌తో పరిష్కారం

పట్టణంలో కూరగాయల క్రయవిక్రయాలకు సంబంధించి రూ.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌తో సమస్యకు పరిష్కారం దొరికే అవకాశం ఉంది. ప్రస్తుతం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ మార్కెట్‌ను నిర్మిస్తున్నారు. అయితే పనులు పునాదులకే పరిమితం కావడంతో నిర్మాణం పూర్తిపై నీలినీడలు అలుముకున్నాయి.

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం..



నిరుపయోగంగా మారిన రైతుబజార్‌ను సద్వినియోగం చేసుకునే విధంగా ఆలోచిస్తాం. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ఇక్కడ అన్ని వనరులు సౌకర్యంగా ఉన్నాయి. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు చేపడుతాం.

– గోవర్ధన్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్, బాదేపల్లి



నిరుపయోగంగా మారిన షాపింగ్ కాంప్లెక్స్

రోడ్డుపైనే విక్రయాలు

రైతుబజార్ మూతబడడంతో ప్రస్తుతం బాదేపల్లి మార్కెట్ యార్డు రోడ్డుపై కూరగాయల విక్రయాలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ కూడా రోడ్డు చిన్నదిగా ఉండడం, ఇదే రోడ్డుపై మార్కెట్‌కు వచ్చే పంట దిగుబడుల రాకపోకలతోపాటు రైల్వే రేక్ పాయింట్ నుంచి ఎరువుల రవాణా సాగుతుండడంతో లారీలు ఇతర వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. ఇది కూరగాయల అమ్మకాలకు అనువుగా లేని కారణంగా విధిలేక ఇక్కడ నిర్వహణ తప్పనిసరిగా మారింది.

ఆ కార్యాలయానికి అనుకూలం

రూ.కోట్లు ప్రజాధనం వెచ్చించి నిర్మించిన రైతుబజార్‌ను ఏం చేయాల్లో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. దీనిని ఏదైనా ప్రభుత్వ కార్యాలయానికి కేటాయిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. ప్రస్తుతం రైతుబజార్ పక్కనే అద్దె భవనంలో కొనసాగుతున్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి కేటాయిస్తే అనుకూలంగా ఉంటుందని పేర్కొంటున్నారు. సువిశాల పార్కింగ్‌తోపాటు వరుసగా నిర్మించిన షట్టర్లు డాక్యుమెంట్ రైటర్స్‌కు అనుకూలంగా ఉంటాయని, రైతుబజార్ షెడ్‌ను తొలగించి సబ్ రిజిస్ట్రార్ భవనాన్ని నిర్మించినా.. యథాతథంగా కొనసాగించినా బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు. ఫలితంగా ప్రభుత్వానికి ఆదాయంతోపాటు ఇక్కడి వనరులను వినియోగించుకునే పరిస్థితి ఉంటుందంటున్నారు. లేదా కోర్టుల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నా బాగుంటుందని అంటున్నారు. ఆయా శాఖలకు పూర్తి హక్కులతో రైతుబజార్‌ను అప్పగించినా శాశ్వత భవనాలు ఏర్పాటు చేసుకునే పరిస్థితి ఉంటుందని, పాలకులు, అధికారులు ఆ దిశగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎన్నికల ముందు నాటకాలా?

- కాల్వలు లేకుండా నీళ్లెక్కడ అందిస్తారు
- తాగునీటి ప్రాజెక్టుగా ఎందుకు చెబుతున్నారు
- మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

సాక్షి, నాగర్‌కర్నూల్: పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తిచేస్తామని గతంలోనే ఇచ్చిన హామీ నెరవేర్చకుండా ఎన్నికల ముందు మళ్లీ నాటకాలాడుతున్నారని మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి విమర్శించారు. నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పనులను 30 నెలల్లో పూర్తి చేస్తామని చెప్పి ఏడున్నర ఏళ్లు దాటినా ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికల ముందు నీళ్లు తెస్తామని మాయమాటలు చెబుతున్నారని దుయ్యబట్టారు. మెయిన్ కెనాల్, డిస్ట్రిబ్యుటరీ కెనాల్, ఫీడర్ కెనాల్ నిర్మాణాలను చేపట్టలేదని, కాల్వలు లేకుండా పంటలకు నీరెలా అందిస్తారని ప్రశ్నించారు. ప్రాజెక్టు వద్ద ఇంకా అప్రోచ్ కెనాల్ పనులు పెండింగ్‌లోనే ఉన్నాయని చెప్పారు. దక్షిణ తెలంగాణప్రాంతానికి సాగు నీరందిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు తాగునీటి కోసమని ఎందుకు అబద్ధాలు చెబుతోందని ప్రశ్నించారు. ఇప్పటికే మిషన్ భగీరథ కోసం ప్రత్యేక ప్రాజెక్టు ఉండగా, మళ్లీ తాగునీటి ప్రాజెక్టు పేరుతో మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఏదుల రిజర్వాయర్ వద్ద పంప్‌హౌజ్‌లో 9 మోటార్లకు రూ. 803.61 కోట్లకు బీహెచ్ఈఎల్ అందిస్తే, ప్రభుత్వం మాత్రం సంబంధిత ఏజెన్సీకి రూ. 2,436.95 కోట్లు ముట్టజెప్పిందని ఆరోపించారు. ఇప్పటికైనా మోటార్లకు సంబంధించిన ఇన్వాయిస్‌ను బయటపెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కృష్ణాజలాలపై తమకు 299 టీఎంసీల మేరకే వాటా ఉందని సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రి హరీశ్‌రావు సంతకాలు చేశారని, ఇప్పుడు వాటా తేల్చలేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ నిర్మించిన కేఎల్ఐ కాల్వలపై పైపులైన్లు వేసి తామే నీటిని అందిస్తున్నామని చెబుతున్నారని విమర్శించారు. తాను వేసిన కేసులతో ప్రాజెక్టు పనులు ఒక్క నిమిషమైనా ఆగాయా? అని ప్రశ్నించారు. ప్రాజెక్టు పనులు ఆపాలని కేసులు వేసిన వారిని సిగ్గులేకుండా పార్టీలో చేర్చుకున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు అర్థం రవి, నారాయణగౌడ్, తిమ్మాజిపేట పాండు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బీచుపల్లి అంజన్న బ్రహ్మోత్సవాలు



కృష్ణానదిలో ఆంజనేయస్వామికి అమృతస్నానం చేయిస్తున్న అర్చకులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల పరిధిలోని బీచుపల్లి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిసాయి. ఉత్సవాలలో భాగంగా చివరి రోజు ఉదయం సన్నాయి వాయిద్యాల మధ్య స్వామివారిని ఆలయం నుంచి పల్లకీలో కృష్ణానది వరకు ఊరేగించారు. అర్చకుల వేద మంత్రాల మధ్య అమృతస్నానాన్ని వైభవంగా నిర్వహించి.. ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాభిషేకం చేశారు. ఈ ఘట్టాన్ని వందలాదిమంది భక్తులు తిలకించారు. ఆలయ ధ్వజస్తంభం ముందు కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలను నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఉమారాణి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో బీచుపల్లి ఆంజనేయస్వామి